క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ

సత్తెనపల్లి: పట్టణంలోని గార్లపాడు సెంటర్‌లో సత్తెనపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు, వ్యాపార సంస్థ స్థాపకుడు ఆత్మకూరి వెంకట హరేరామచెంచయ్య ఆధ్వర్యంలో ముద్రించిన శ్రీ మారుతీ ట్రేడర్స్ వారి నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్‌ను ఆర్యవైశ్య నాయకులు జవ్వాజి రామమోహన రావు, పెండ్యాల కాశీ మల్లేశ్వరరావు, పోతు గంటి రామకోటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాస రావులు బుధవారం ఆవిష్కరించారు. పలువురు కష్టమర్లకు పంచిపెట్టారు.

కొనసాగుతున్న ధనుర్మాస పూజలు




సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీవారి ఆలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో కనుల పండుగగా పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని వడవల్లి శ్రీ రామాలయం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం శ్రీవారికి గంధంతో చందన అలంకరణ, సీతా రామ, లక్ష్మణ, కోదండ రామస్వామిలకు శ్వేత వర్ణ అలంకారం చేపట్టారు. రైల్వేస్టేషన్‌రోడ్‌లోని శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి నవనీతం అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

దేవునిపై విశ్వాసంతో జీవించాలి

ఆర్‌సీఎం చర్చి ఫాదర్ వినోద్‌కుమార్



అమరావతి: మనిషి తన ఐహిక కోర్కెలను విడిచిపెట్టి దేవుని యందు విశ్వాసంతో ఉండి, ప్రశాంత చిత్తంతో జీవించాలని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ వినోద్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని వైకుంఠపురం గ్రామంలో ఆర్సీఎం చర్చి ప్రతిష్ట ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ఉత్సవాలను నిర్వహించారు. ఉదయాన్నే ప్రార్థనా కార్యక్రమాలలో భాగంగా ఫాదర్ వినోద్‌కుమార్, థామస్‌ల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో దివ్య పూజాబలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ అందరూ దైవం పట్ల విశ్వాసంతో తోటి మానవుల పట్ల కరుణతో జీవించాలన్నారు. సాయంత్రం భక్తులచే ఒత్తుల సమర్పణ, రాత్రి ప్రత్యేకంగా విద్యుత్‌దీపాలు, పూలతో అలంకరించిన దివ్యరథంపై ఏసుప్రభువు, మేరీమాత విగ్రహాన్ని ఉంచి పురవీధులలో ఘనంగా తేరు ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువులు, సంఘపెద్దలు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు రగ్గులు పంపిణీ



మాచర్ల: పట్టణంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రామకృష్ణ సేవా సమితి, మాచర్ల వారి ఆధ్వర్యంలో వృద్ధులు, గిరిజన మహిళలు, చిన్నారులకు బుధవారం రగ్గులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కమిషనర్ డి.వేణు బాబు, డాక్టర్ చల్లా వెంకటేశ్వర్లు, సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డిలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వేణుబాబు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పేదలకు అన్నదానం, వివిధ సేవా కార్యక్రమాలు సేవా సమితి నిర్వహించటం సంతోషకరమన్నారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కల్పన, అఖిల్ సహాయంతో రగ్గులు పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్ బీవీఎస్ రెడ్డి, రామయ్య, నిఖిల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

శావల్యాపురం: 2025 నూతన సంవత్సరం సందర్భంగా మండలంలో అన్నీ ప్రార్థన మందిరాల్లో నూతన సంవత్స ర వేడుకలతో పాటు ప్రత్యేక ప్రార్థనలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. శావల్యాపురంలో విమోచన ప్రార్థన మందిరంలో మత భోధకులు సి.హెచ్. యేహెజ్కేలు ఏసుక్రీస్తు సందేశాన్ని వివరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది గంధం వెంకటేశ్వర్లు ఒంటరి మహిళలకు నూతన వస్త్రాలను అందజేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వయ్యకల్లు గ్రామంలో స్వస్థత ప్రార్థన మందిరంలో దైవసేవకులు వి.ఏసుపాదం, శూలవతి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పేదలకు నూతన వస్త్రాలు అందజేశారు. ప్రార్థన మందిరాలు విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.

అంబరం.. 'నూతన' సంబరం

- ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు
- కేకులు కట్ చేసి సందడి చేసిన యువత
- నేతలకు వెల్లువెత్తిన శుభాకాంక్షలు
- కిటకిటలాడిన ఆలయాలు, చర్చిలు



మాజీ మంత్రి అంబటి రాంబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న న్యాయవాదులు



పట్టణంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో పూజల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



నూతన సంవత్సర వేడుకల్లో కేక్‌కట్ చేస్తున్న బ్యాంగ్ బ్రోస్ టీం

సత్తెనపల్లి: నియోజకవర్గవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు, చర్చీలు కిటకిటలాడాయి. బుధవారం ఉదయం పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో గల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రఘురాంనగర్‌లోని తన కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని గురుకుల పాఠశాల విద్యార్థినులకు నోట్‌పుస్తకాలు, పట్టణంలోని ఏరియా వైద్యశాలలోని రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

- నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబుకు నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు. అక్కడ కేక్ కట్ చేసి చేపట్టిన నూతన సంవత్సర వేడుకలు సందడిని తలపించాయి. గుంటూరు మిర్చియార్డ్ మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి రాము, రాయపాటి పురుషోత్తమరావు, మర్రి సుబ్బారెడ్డి, కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, అచ్యుత శివప్రసాద్, జూపల్లి పాల్, సంకుల తిరుమలరావు, సిరిగిరి వెంకట్రావు, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, మండదపు సాయి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.
- పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి గృహంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు హాజరై పూల బొకేలు అందించి దుశ్శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయ వాదులు దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్, మాదంశెట్టి వేద్రాద్రి, తదితరులు ఉన్నారు.
- పట్టణంలోని వైఎస్సార్ సీపీ నాయకుడు పక్కాల సూరిబాబు గృహంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కాపు సంఘ నాయకులు హాజరై పూల బొకేలు, దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.
- పట్టణంలోని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావు కార్యాలయంలో పట్టణ సీఐ బి.బ్రహ్మయ్య, అమరావతి ఎస్‌ఐలు అమీర్, రాజశేఖర్, సిబ్బంది శంకర్, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దాసరి తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.
- పట్టణంలోని సాయికృష్ణ థియేటర్‌లో బ్యాంగ్ బ్రోస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపు కున్నారు. బ్యాంగ్ బ్రోస్ ప్రతినిధులు షేక్ సలాం, మారూరి లింగారెడ్డి, మాడా మల్లికార్జునరావు, మద్ది భాస్కర్, షేక్ జాకీర్, ఫణిదరపు జగదీష్‌లు శుభాకాంక్షలు తెలిపారు. మారూరి రామలింగారెడ్డి, షేక్ కరీం, గాంధీ, గౌసుల్ వర, తదితరులు ఉన్నారు.
- ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీలోని ఆశ్చర్యకరుడు ప్రార్థన మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ ఓర్సు కిరణ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు హాజరయ్యారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, నల్లబోతు శివనారాయణ, బొడ్డు వెంకటేష్ ఉన్నారు.
- పట్టణంలోని 8వ వార్డ్ క్రిస్టియన్ పేటలోని సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చ్‌లో నూతన సంవత్సర ఆరాధన నిర్వహించారు. చర్చ్ పాస్టర్ రెవ. తాళ్లూరి మధు వాక్య సందేశం అందించారు. చర్చ్ ప్రెసిడెంట్ బలిజేపల్లి సురేష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ జొన్నలగడ్డ హుస్సేన్, ట్రజరర్ గుజ్జర్లపూడి రూబెన్, కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.

కొత్త సంవత్సరానికి అపూర్వ స్వాగతం



నరసరావుపేట: నూతన సంవత్సర వేడుకలు నియోజకవర్గ ప్రజలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే క్రిస్టియన్ సోదరులు సమీపంలోని చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేయ గా, హిందువులు ఉదయాన్నే తమ ఇష్టదైవాలు ఉన్న దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాజకీయ నాయకుల గృహాలు, ఆయా పార్టీల కార్యాలయాలు నాయకులకు శుభాకాంక్షలు తెలియచేసేందుకు వచ్చి వెళ్లేవారితో కళకళలాడాయి. గుంటూరు రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి నియోజక వర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు వందలాదిగా తరలివచ్చి ఆయనకు దుశ్శాలువలు కప్పి కేకులు కట్‌చేయించి మిఠాయిలు అందజేసి శుభాకాంక్షలు తెలియచేశారు. అలాగే ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును గుంటూరు రోడ్డు లోని టీడీపీ కార్యాలయంలో పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుల సంఘీయులు కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఆయనకు దుశ్శాలువాలు కప్పి కేకులు కట్‌చేయించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డికి ఆయన అభిమానులు పెద్దసంఖ్యలో ప్రకాష్‌నగర్‌లోని గృహానికి తరలి వచ్చి శుభాకాంక్షలు తెలియచేశారు.

అమ్మలేక.. తనఖాకు నోచుకోక..!

- క్రోసూరు కొండకింద బజారు వాసుల అవస్థలు
- 2015లో నిర్వహించిన సర్వేలో గ్రామ కంఠం భూమి చెరువు సర్వే నంబర్‌లో నమోదుతో సమస్య
- అనంతరం సర్వే చేసి సరిచేసినప్పటికీ సీసీఎల్‌ఏలో నిలిచిపోయిన ఫైల్
- సబ్ డివిజన్ అనుమతులు రాక రిజిస్ట్రేషన్లు, తనఖాకు నోచుకోక పదేళ్లుగా అవస్థలు
- ఇటీవల రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు అర్జీలు ఇచ్చిన స్థానికులు



క్రోసూరు కొండకింద బజారు వ్యూ

క్రోసూరు: ఆస్తులున్నా అమ్ముకోవటానికి లేక, తనఖా పెట్టుకోవాటానికి వీలుపడక సుమారు 10 సంవత్సరాలుగా జనం అవస్థలు పడుతున్నారు. క్రోసూరులోని కొండ కింద బజారులో నివసిస్తున్న 2వేల గృహాల వారు ఈ ప్రాంతం సబ్ డివిజన్‌కు నోచుకోకపోవటంతో నానా అవస్థలు పడుతున్నారు. 2015కు పూర్వం 594–ఏ2 సర్వే నంబర్‌లో కొండ కిందబజారులో నివసిస్తున్న ప్రజల భూములు గ్రామకంఠం కింద రిజిస్ట్రేషన్లు ప్రక్రియ జరిగేది. అయితే ఆ తరువాత అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కొత్తగా చేపట్టిన సర్వే ప్రకారం 594–ఏ2 గ్రామకంఠం భూమిని పక్కనే ఉన్న చెరువు సర్వే నంబర్‌గా తప్పుగా నమోదు చేసింది. అంటే 594–ఏ2 పూర్తిగా చెరువు భూమిగా నిర్ణయించింది. అక్కడి నుంచి ప్రజల అవస్థలు మొదలయ్యాయి. ఇంటి అవసరాలకు, పిల్లల పెళ్లిళ్లకు, చదువులకు, అమ్ముకునేందుకు, కానీ తనఖా పెట్టుకునేందుకు కానీ వీలుపడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

2017లో రీ సర్వే..

ప్రజల ఆందోళన మేరకు అప్పటి జిల్లా కలెక్టర్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి సమక్షంలో రీసర్వే చేయించి 594–ఏ2బీ గా కొండకింద బజారు ప్రాంతం 22.50 ఎకరాలుగా గుర్తించింది. మిగతాది 594–ఏ2 చెరువు భూమిగా తేల్చి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. అయితే అధికారులు చేపట్టిన సబ్‌డివిజన్ వివరాలు సీసీఎల్‌ఏలో నమోదు కోసం పంపినప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా సమస్య పరిష్కారం కాలేదు. అక్కడ నుంచి తిరిగి ఎటువంటి ఆదేశాలు రాలేదు.

రెవెన్యూ సదస్సులో అర్జీలు...

ఇటీవల క్రోసూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ శ్రీనివాసయాదవ్‌కు ఈ విషయమై స్థానిక ప్రజలు అర్జీలు అందచేశారు. తమ సమస్య పరిష్కరించాలని కోరారు.

పిల్లల చదువులకు ఇబ్బందులు..



పిల్లల చదువుల కోసం తనఖా పెట్టేందుకు బ్యాంకుల్లో ప్రయత్నించినా పాత డాక్యుమెంట్ల ప్రకారం రుణాలు ఇవ్వటంలేదు. నానా ఇబ్బందులు పడుతున్నాం.
– తిప్పిరెడ్డి జ్యోతి, క్రోసూరు

ఏళ్ల తరబడి రిజిస్ట్రేషన్లు లేవు...



పదేళ్లుగా ఇక్కడి ప్రజలు ఆస్తులు అమ్ముకునేందుకు వీలు పడటం లేదు. అవసరాలకు డబ్బు దొరకక ఏం చేయాలో పాలుపోక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం సమస్య పరిష్కరించాలి
– తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, క్రోసూరు

ఆస్తి ఉన్నా లేనట్టే



మాకు పేరుకు ఆస్తి ఉన్నా అవసరానికి అక్కరకు రానట్లుంగా ఉంది. రిజిస్ట్రేషన్లు జరగవు, తనఖాకు నోచుకోకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.
– ఛత్రి మీరయ్య, క్రోసూరు

పలు సంఘాల నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



ఎస్‌టీయూ ఉపాధ్యాయుల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ నాయక్



ఉపాధ్యాయుల పాకెట్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ అల్లి సురేష్



ఏపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

మాచర్ల రూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘాల నాయకులు అధికారులచే నూతన సంవత్సర క్యాలెండర్లను బుధవారం ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ నాయక్, ఎంఈఓ కార్యాలయ ఆవరణలో ఎంఈఓ అల్లి సురేష్ చేతుల మీదుగా ఎస్‌టీయూ ఉపాధ్యాయ సంఘ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ నాయకులు జి.గంగాధర్ బాబు, భాస్కర్‌బాబు, రాజశేఖర్, ఎక్స్‌మస్ జాన్, మధుసూదనరావు, సిలార్ అహమ్మద్, బాలునాయక్ తదితరులున్నారు. పెన్షనర్స్ భవనంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయుల వార్షిక క్యాలెండర్లను రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకులు జక్కిరెడ్డి మర్రెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు సీహెచ్ కొర్లయ్య, కృష్ణారావు, పిచ్చయ్య తదితరులున్నారు.

రామాలయంలో ధనుర్మాస పూజలు



మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావును సన్మానిస్తున్న రామాలయ కమిటీ సభ్యులు

మాచర్ల: పట్టణంలో వేంచేసియున్న కోదండ రామాలయ నూతన కార్యవర్గం దేవాలయంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీని పోలూరి అభినందించారు. ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన మున్సిపల్ చైర్మన్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు పోలిశెట్టి పిచ్చయ్య, అధ్యక్షుడు బచ్చు రామారావు, సెక్రటరీ బాల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, ఆంజనేయులు, కర్నాటి అప్పారావు, పోలూరి వెంకటేశ్వర్లు మారం శ్రీను, మేడం శివరామకృష్ణ తదితరులున్నారు.

మొక్కజొన్నకు బొగ్గు కుళ్లుడు తెగులు

నివారణ లేదు – పంట మార్పిడి, లోతు దుక్కులతో తెగులు నివారణ



వ్యవసాయ అధికారి శివలలిత

రొంపిచర్ల: మొక్కజొన్న పంటను ఆశిస్తున్న బొగ్గు కుళ్లు తెగులుపై మండల వ్యవసాయ అధికారి శివలలిత రైతులకు పలు సూచనలు చేశారు. ముందుగా ఈ బొగ్గు కుళ్లు తెగులు ఆశించిన పైరు కాండం విరిగి నేలపై పడిపోతుంది. ఇలాంటి మొక్కలను కాండం చీల్చి చూస్తే లోపల బెండుబాగం కుళ్లి తెలుపు రంగు నుంచి నలుపు రంగుకు మారి ఉంటుంది. ఈ తెగులు ఈఏడాది మాచవరం, పరగటిచర్ల గ్రామాల్లో సాగుచేస్తున్న మొక్కజొన్న పైరులో కనిపించిందన్నారు. ఈ మొక్కల కాండంపై ఆకు తొడెమలపై నల్లరంగు, గోధుమరంగు మచ్చలు వస్తున్నాయి. ఈ మచ్చలు కాస్తా పెరిగి మొక్క ఎండిపోతుంది. దీనికి నివారణ లేదన్నారు. తాత్కాలికంగా ఆ పంటకు యూరియా వాడకం నిలిపి వేయాలన్నారు. మురుగు నీరు దరి చేరకుండా చూసుకోవాలి. 35 శాతం క్లోరిన్ కలిగిన బ్లీచింగ్ పౌడర్‌ను ఎకరాకు 4 కేజీల చొప్పున మొక్కల మొదళ్లలో చల్లడం, లేదా నీటితో కలిపి మొక్కల చుట్టూ నేల తడపడం చేయాలన్నారు. పొటాష్ ఎరువు వాడాలన్నారు.

నివారణకు చర్యలు

ఈ తెగులు సోకకుండా ఉండేందుకు పొలాన్ని వేసవిలో లోతు దుక్కులు చేయాలన్నారు. దాంతో పాటు పచ్చిరొట్ట పైరులు సాగుచేసి భూమిలో కలియదున్నాలన్నారు. ట్రైకోడెర్మా సిలీంద్రియాన్ని పశువుల ఎరువులతో కలిపి అభివృద్ధి చేసి వరుసగా మూడు నాలుగు సంవత్సరాల పాటు నేలలో కలియ దున్నాలన్నారు. ఎకరాకు అదనపు పొటాష్ ఎరువులను వాడాలన్నారు. పొలంలో మొక్కజొన్న సాగుచేసే సమయంలో బోదెలపై విత్తనాలు విత్తుకోవాలన్నారు. పంట మార్పిడి తప్పనిసరిగా పాటించాలని ఆమె సూచించారు.

ఓవరాల్ చాంపియన్స్‌గా తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు



పిడుగురాళ్ల: గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ గుంటూరు ఆధ్వర్యంలో గుంటూరులోని ఎన్‌టీఆర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో అండర్–16 ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, త్రో బాల్, అండర్–14 అథ్లెటిక్స్, అండర్–12 అథ్లెటిక్స్‌లో స్థానిక తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన టీమ్‌గా నిలిచారని ప్రిన్సిపాల్ కె.సురేష్ బుధవారం తెలిపారు. ఈ విజయంలో పాలు పంచుకున్న విద్యార్థులను, ఉత్తమ శిక్షణ అందించిన వ్యాయామ ఉపాధ్యాయులను కళాశాల డైరెక్టర్ బొల్లా గిరిబాబుతో పాటు ప్రిన్సిపాల్స్ అభినందించారు. కష్టపడి ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించినందుకు విద్యార్థులను అభినందించారు.

బొల్లవరంలో నేడు రైతు సదస్సు

ముప్పాళ్ళ: మండలంలోని బొల్లవరం గ్రామంలో ఈ నెల 2వ తేదీన రైతు సదస్సు జరుగుతుందని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గ్రామసచివాలయం వద్ద జరిగే సదస్సులో రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు.

బూజు పురుగు తెగులును నివారించండి

అమరావతి: మండల పరిధి గ్రామాలలో సాగు చేస్తున్న కంది పైరు ప్రస్తుతం పూతపిందెల దశలో ఉందని వాటిని ఆశించే బూజుపురుగు తెగులుపై అప్రమత్తంగా ఉండి వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి అహ్మద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కందిపైరులో పూతను ఆశించి బూజులో ఉండే సన్నపురుగు నివారణకు నువాన్, మోనోక్రోటోఫాస్‌లను సిఫార్సు చేసిన మోతాదులో పిచికారీ చేయాలన్నారు. అలాగే లద్దె పురుగు నివారణకు హోస్టాథియాన్‌ను పిచికారీ చేస్తే మంచి ఫలితముంటుందన్నారు.

సీతారామాలయంలో అన్నదానం



విజయపురిసౌత్: నూతన సంవత్సరం పురస్కరించుకొని విజయపురిసౌత్ రామాలయంలో బుధవారం అన్నదానం, తిరుపతి డైరీలు, క్యాలెండర్ల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఎం.సుబ్బలక్ష్మి, ఎంవీ రమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో ధనుర్మాసం, నూతన సంవత్సరం పురస్కరించుకొని ప్రత్యేక పూజల అనంతరం వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షులు వసంతకుమార్ రెడ్డి, న్యాయవాది సీహెచ్ నాగిరెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సరం దేవుని సన్నిధిలో కార్యక్రమం నిర్వహించటం ఎంతో అభినందనీయమని సుబ్బలక్ష్మి, రమణిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎం.రామాంజనేయులు, జి.అమరకుమార్, జీవీజీ కృష్ణమూర్తి, బుద్ధారెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్ బసివిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

దేవాలయంలో ప్రత్యేక పూజలు



రాజుపాలెం: మండలకేంద్రంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి బుధవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అదే విధంగా బ్రాహ్మణపల్లిలోని మరకతలింగం కలిగిన శివాలయానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేజ పూజలు జరిపించుకున్నారు. పూజారి కోనూరి నరసింహ శ్రీనివాసశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు.

నేడు సీతారావమ్మ ఆరాధన కార్యక్రమం

బెల్లంకొండ: మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో గల శ్రీ కొండ శింగరేశ్వర స్వామి ఆశ్రమంలో గురువారం మాతాజీ సీతారావమ్మ గారి 9వ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలలో భాగంగా బుధవారం సాయత్రం నుంచి భజనా కార్యక్రమాలు ప్రారంభించారు. గురువారం శాస్త్రానుసారంగా పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం జెండా ఊరేగింపు చేయనున్నట్లు తెలిపారు. పలు ప్రాంతాలలోని మాతాజీ శిష్యులు, భక్తులు ఆరాధనా కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు.